# బుక్కావాని తైలములో చచ్చిన ఈగలు

బుక్కా వాని తైలములో చచ్చిన ఈగలు పడుట చేత అది చెడువాసన కొట్టును; కొంచెము బుద్ధిహీనత త్రాసులో ఉంచినయెడల జ్ఞానమును ఘనతను తేల గొట్టును. ప్రసంగి 10:1

## ఉపోద్ఘాతం

పరిమళ తైలంలో ఈగలు పడి చస్తే దానికి దుర్వాసన ఉంటుంది. అవివేకంతో కూడిన బలహీనతలు మన జీవితాలలో ఇతరులు భరించలేని దుర్వాసన కలుగజేయగలవని కనుక విలువైన పరిమళ తైలం వంటి మనఅద్భుతమైన జీవితాన్ని నాశనం చేసే చచ్చిన ఈగల వంటి బలహీనతలను దూరపర్చుకోవాలని, అటువంటి జ్ఞానమే ఉత్తమమని సొలొమోను అభిప్రాయం.

## 1. బుక్కావాని తైలం

దేవుడే సుగంధద్రవ్య మేళకుడు, అయన చేత తయారు చేయబడిన ఈ తైలం ఎంతో విలువైనది మరియు ఖరీదైనది. దేవుడు నీకిచ్చిన జీవితం ఎంతో విలువైనది. దేవుని చేతిపని అయిన విలువైన పరిమళ భరితమైనది నీ జీవితం.

(నిర్గ 30:25 వాటిని ప్రతిష్ఠాభిషేక తైలము, అనగా సుగంధద్రవ్య మేళకుని పనియైన పరిమళసంభారముగా చేయవలెను. అది ప్రతిష్టాభిషేక తైలమగును.) తన అద్భుతమైన జీవాత్మ నీలో ఊదగా నీవు పరిమళ తైలం వంటి మానవునిగా మారినావు. తైలం పరిశుద్ధాత్మకు సాదృశ్యం.

## 2. చచ్చిన ఈగలు

అద్భుత పరిమళ భరితమైన మన జీవితాన్ని నాశనం చేయుటకు సాతాను చచ్చిన ఈగల వంటి పాపం మరియు బలహీనతలను మన జీవితంలో ప్రవేశ పెట్టుచున్నాడు. నేటి క్రైస్తవ్యం దుర్గంధముతో నిండి ఉంది. విశ్వాసుల జీవితాలు చివరకు సేవకుల జీవితాలలో కూడా ఈ చచ్చిన ఈగలు కనబడుచున్నవి. సువాసన లేదుగాని దుర్వాసన అధికమైనది. ఈ దుర్వాసన మనలను ఇతరులు అసహ్యించుకునేలా చేస్తూ ఉంది. క్రైస్తవ్యానికి విలువ లేకుండా పోవుటకు కారణం సాక్ష్యము లేని జీవితములు. (మత్తయి 15:19 దురాలోచనలు, నరహత్యలు, వ్యభిచారములు, వేశ్యాగమనములు, దొంగతనములు, అబద్ధసాక్ష్యములు, దేవదూషణలు హృదయములో నుండియే వచ్చును. ఇవే మనుష్యుని అపవిత్రపరచును. గలతీ 5:19-21 శరీరకార్యములు స్పష్టమైయున్నవి; అవేవనగా, జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు మొదలైనవి.)

## 3. చచ్చిన ఈగలను కనిపెట్టలేని స్థితి

ఇది పాప ప్రభావం. అయితే ఎవరి కంపు వారికి ఇంపు అనే సామెత మాదిరిగా, పాప ప్రభావం వలన ఎవరికీ వారు దుర్వాసనకు అలవాటు పడిపోయారు. పైగా మా దగ్గర దుర్వాసన లేదు అని బుకాయిస్తారు. దీని వలన వారి జీవితాలు కుటుంబ సభ్యులకు, సంఘానికి సమాజానికి దేవునికి బహు అసహ్యకరంగా ఉండగలవు, చివరకు వారికి పరలోక ప్రవేశం నిరాకరించబడును.(రోమా3:23 అందరును పాపముచేసి దేవుడు అను గ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు. గల 5:21 వీటినిగూర్చి నేనుమునుపు చెప్పిన ప్రకారము ఇట్టి వాటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరని మీతో స్పష్టముగా చెప్పుచున్నాను.)

## 4. ఆత్మీయంగా ఎదగని స్థితి

చిన్న పిల్లలు తమ దుర్వాసన తాము కనిపెట్టలేరు. ఆత్మీయంగా ఎదగని వారు కూడా తమలోని పాపపు బలహీనతలను కనిపెట్టలేక నిస్సహాయులుగా మిగిలి పోతారు. కనుక అటువంటివారికి సేవకులు సంఘం యొక్క సహాయం అవసరం. (1కొరి 14:20 సహోదరులారా, మీరు బుద్ధివిషయమై పసిపిల్లలు కాక దుష్టత్వము విషయమై శిశువులుగా ఉండుడి; బుద్ధి విషయమై పెద్దవారలై యుండుడి.)

## 5. చచ్చిన ఈగలను కనిపెట్టే స్పాట్ లైట్

చచ్చిన ఈగలను కనిపెట్టగలిగిన స్పాట్ లైట్ దేవుని వాక్యమే. చచ్చిన ఈగలవంటి మన తప్పుడు మార్గములను బలహీనతలను కనిపెట్టుటకు స్పాట్ లైట్ వంటి దేవుని వాక్యపు వెలుగు అవసరం. (కీర్తన 119:104 నీ ఉపదేశమువలన నాకు వివేకము కలిగెను తప్పు మార్గములన్నియు నా కసహ్యములాయెను. 105 నీ వాక్యము నా పాదములకు దీపమును నా త్రోవకు వెలుగునై యున్నది)

## 6. చచ్చిన ఈగలను తొలగించమని ప్రార్ధన చేయవలసి యున్నది

దుర్వాసన కొట్టుచున్న లేదని బుకాయించే మూర్ఖస్థితి నుండి విడుదల పొందుకోవడం జ్ఞానం.అది చేయగల నిజదేవుని సహాయం తీసుకోవడమే జ్ఞానమని సొలోమోను బోధించు చున్నాడు.మన దుర్వాసన మనకు తెలియడం లేదు కనుక పరిశుద్ధుడైన దేవుని సహాయం మనకు అవసరం. చచ్చిన ఈగల వంటి బలహీనతలు మన హృదయంలో ఉన్నవేమో అని హృదయ పరిశీలన చేయాలని పరిశుద్ధ గ్రంధం చెప్పుచున్నది. (కీర్తన 139:23,24 దేవా, నన్ను పరిశోధించి నా హృదయమును తెలిసి కొనుము నన్ను పరీక్షించి నా ఆలోచనలను తెలిసికొనుము  నీకాయాసకరమైన మార్గము నాయందున్న దేమో చూడుము నిత్యమార్గమున నన్ను నడిపింపుము.)

## 7. యేసు రక్తమే నిన్ను పవిత్ర పరచును

నీ జీవితం నాశనం కావడానికి కారణమైన చచ్చిన ఈగలను తొలగించి తిరిగి నీ జీవితాన్ని పరిమళ వాసనగా చేయుటకే దేవుని కుమారుడైన యేసు ఈ లోకానికి దిగివచ్చాడు. ఎఫెస్సి 5:2 క్రీస్తు మిమ్మును ప్రేమించి, పరిమళ వాసనగా ఉండుటకు మనకొరకు తన్నుతాను దేవునికి అర్పణముగాను బలిగానుఅప్పగించుకొనెను; ఆలాగుననే మీరును ప్రేమగలిగి నడుచుకొనుడి. తన విలువైన రక్తాన్ని కార్చాడు. ఆయన కార్చిన రక్తధారల వలన మాత్రమే నీ హృదయం పరిశుద్ధ పరచబడ గలదు. మన ప్రభువు తన రక్తము ద్వారా మనలను కడిగి ఉచితమైన తన కృప ద్వారా మనలను పవిత్రులనుగా చేసెను. మన పవిత్ర ప్రవర్తన అనేకుల రక్షణకు కారణమగును (1పేతురు 3-1) పవిత్రులు దేవుని ముఖ దర్శనము చేయుదురు (హెబ్రీ:12-14) పవిత్రత, పరిశుద్ధత కలిగియున్నప్పుడే మనం దేవుని బిడ్డలం. అప్పుడే దేవుని రూపం మనలో కనిపించును. (1యోహాను 1:7 అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల. మనము అన్యోన్యసహవాసము గలవారమై యుందుము; అప్పుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపమును పవిత్ర పరచును.) యేసు రక్తము మాత్రమే చచ్చిన ఈగలను సమూలంగా తొలగించి తిరిగి నీ జీవితాన్ని పరిమళభరితంగా మార్చగలదు.

## ముగింపు

దుర్వాసనను పోగొట్టుకోవడమే సాక్ష్యము. అలాగే కడగబడిన మనకు దేవుని ఆత్మశక్తితో సువాసనను పొందిన వారమైన మనము దానిని కోల్పోకుండా కాపాడుకోవాలి. బంధువుల యెదుట స్నేహితుల యెదుట సంఘములోను సమాజములోను పరిమళవాసనగా ఉండి దేవుని మహిమపర్చుడి. అటువంటి కృపను దేవుడు మనకు సమృద్ధిగా అనుగ్రహించును గాక! ఆమేన్!!